క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భవానీపురం(విజయవాడపశ్చిమ): చిట్టినగర్ సెక్షన్ పరిధిలోగల 11 కేవీ కొత్త అమ్మవారి టెంపుల్ ఫీడర్ లైన్ల మరమ్మతుల నిమిత్తం కొన్ని ప్రాంతాల్లో రెండు గంటలపాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీర్ (విజయవాడ టౌన్) బీవీ సుధాకర్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు లలితా బార్ ఏరియా, టీఎంహెచ్ఎస్ స్కూల్, టీనర్‌పేట, రాయపరాజు వీధి, కొత్త అమ్మవారి గుడి, ఈద్గా మహల్, మోతీ మసీదు ప్రాంతాల్లో పైన పేర్కొన్న సమయాల్లో కరెంట్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన వివరించారు. విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

దక్షిణామూర్తికి అభిషేకాలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై మల్లేశ్వర స్వామి వారి ఆలయం సమీపంలోని దక్షిణామూర్తికి గురువారం విశేష అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. గురువారం ఉదయం ఆలయ అర్చకులు దక్షిణామూర్తికి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించిన అనంతరం విశేషంగా అలంకరించి పూజలు నిర్వహించారు. ఆలయ వైదిక కమిటీ సభ్యుల పర్యవేక్షణలో నిర్వహించిన పూజా కార్యక్రమాలలో పలువురు ఉభయదాతలు, భక్తులు పాల్గొన్నారు.

ముగిసిన మజ్జిగ పంపిణీ

భవానీపురం(విజయవాడపశ్చిమ): వేసవి కాలాన్ని పురస్కరించుకుని భవానీపురం పాత హౌసింగ్‌బోర్డ్ కాలనీలో గల సంకల్పసిద్ధి శ్రీషిర్డీ సాయిబాబా మందిరంలో ఏప్రిల్ 17 నుంచి గురువారం వరకు 58 రోజుల పాటు నిర్వహించిన మజ్జిగ పంపిణీ కార్యక్రమం ముగిసింది. భక్తుల సహకారంతో ప్రతి రోజూ ఉదయం 10.30 గంటల నుంచి 12.30 గంటల వరకు సాయిబాబా మందిరానికి వచ్చే భక్తులతో పాటు బాటసారులకు ఉచితంగా మజ్జిగ అందజేశారు. మజ్జిగ వితరణకు సహాయ, సహకారాలను అందించిన భక్తులకు ఆలయ ఉపాధ్యక్షుడు మోటుమర్రి సుబ్బారావు ధన్యవాదాలు తెలియజేశారు.

నదిలో దూకి మహిళ ఆత్మహత్య

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విజయవాడ నగరానికి చెందిన ఒక మహిళ నదిలోకి దూకి ఆత్మహత్య చేసుకున్న సంఘటన గురువారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. గురువారం మధ్యాహ్నం ఒక మహిళ ప్రకాశం బ్యారేజీ నుంచి 55వ ఖానా నుంచి నదిలోకి దూకింది. కొద్దిసేపటికి సమాచారాన్ని తెలుసుకున్న బ్యారేజీ సమీపంలోని ఎస్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది బోట్ ద్వారా నదిలో ఆమె దూకిన పరిసర ప్రాంతాల్లో వెతికారు. మృతదేహాన్ని గుర్తించి, బయటకు తీసి వన్‌టౌన్ పోలీసులకు సమాచారం అందించారు. ఆమె వివరాలు తెలియకపోవడంతో పోలీసులు మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం మృతి చెందిన మహిళ కానూరుకు చెందిన వ్యక్తిగా తెలిసింది. ఆమె భర్త ముసునూరు శ్రీనివాసరావు స్టేషన్‌కు వచ్చారు. మృతురాలి పేరు పద్మిని(52)గా పేర్కొన్నారు. భార్యభర్తలు కానూరులో నివాసముంటున్నారని, వారి కుమారుడు అమెరికాలో ఉన్నట్లుగా పేర్కొన్నారు. అయితే పద్మిని కొంత కాలంగా షుగర్ వ్యాధి తీవ్రతతో బాధపడుతున్నట్లుగా, ఇతర అనారోగ్య సమస్యలు కూడా ఉండటంతో మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నట్లు భర్త, ఇతర బంధువులు పోలీసులకు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బడుల్లో సందడి మొదలు

- ఉత్సాహంగా తరలివచ్చిన విద్యార్థులు
- తొలిరోజు యథావిధిగా సాగిన పాఠశాలలు





కొత్తపేట అన్నపూర్ణాదేవి పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని స్వీకరిస్తున్న విద్యార్థులు ; వన్‌టౌన్ హిందూ హైస్కూల్‌లో...

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పశ్చిమ నియోజకవర్గంలో గురువారం బడి గంట మోగింది. వేసవి సెలవులు ముగియడంతో గురువారం చిన్నారుల బుడిబుడి నడకలు ప్రాథమిక పాఠశాలల వైపు సాగాయి. హైస్కూళ్ల విద్యార్థులు నూతన విద్యా సంవత్సరంలో విద్యాభ్యాసానికి సిద్ధమవుతూ పాఠశాలలకు ఉత్సాహంగా తరలివచ్చారు. పశ్చిమ నియోజకవర్గం పరిధిలోని వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో తొలిరోజు విద్యార్థుల సందడి నెలకొంది. ప్రభుత్వ హైస్కూళ్లలో విద్యార్థులకు ప్రధానోపాధ్యాయులు అకడమిక్ ఇయర్ గురించి వివరించి పలు సూచనలిచ్చారు. తొలి రోజు పాఠశాలలు ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకూ జరిగాయి. గతంలో పాఠశాలల పునఃప్రారంభం రోజు నుంచి కొద్ది రోజులు ఒంటిపూట బడులు కొనసాగేవి. అయితే ఈ ఏడాది వేసవి తీవ్రత తగ్గటంతో పూర్తి స్థాయిలో పాఠశాలలు తొలి రోజు నుంచే పనిచేశాయి.

నామమాత్రంగా హాజరు

పశ్చిమ నియోజకవర్గంలోని పాఠశాలలు గురువారం పునః ప్రారంభం అయిన నేపథ్యంలో తొలి రోజు విద్యార్థుల హాజరు అంతంతమాత్రంగానే ఉంది. నియోజకవర్గంలో సుమారుగా 70కు పైగా ఎయిడెడ్, ఇతర ప్రభుత్వ యాజమాన్యాలకు సంబంధించి విద్యాసంస్థలు కొనసాగుతున్నాయి. మరో 50 వరకూ ప్రైవేట్ విద్యాసంస్థలు కొనసాగుతున్నాయి. అన్ని విద్యాసంస్థల్లో విద్యార్థుల సంఖ్య తొలి రోజు నామమాత్రంగానే ఉన్నట్లు నిర్వాహకులు తెలిపారు. మరో రెండు రోజుల్లో ఆదివారం, బక్రీద్ సెలవు ఉండటంతో విద్యార్థులు మరో మూడు రోజులు సెలవులు తీసుకోనున్నట్లు తల్లిదండ్రులు చెబుతున్నారు.

విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పు

పశ్చిమ నియోజకవర్గంలో చాలా విద్యాసంస్థల్లో రెండో విడత నాడు–నేడు పనులు కొనసాగుతున్నాయి. ఇప్పటికే అన్ని పాఠశాలల్లో డిజిటల్ వస్తువుల వినియోగం ద్వారా బోధన కొనసాగుతోంది. ఎల్‌ఈడీ స్క్రీన్లు, ట్యాబ్‌ల ద్వారా విద్యార్థులకు బోధన జరుగుతోంది. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారు. బడి ఈడు పిల్లలందరూ చదువుకోవాలనే సత్సంకల్పంతో విద్యా పథకాలకు సీఎం అత్యంత ప్రాధాన్యమిచ్చారు. నాడు–నేడు ద్వారా నియోజకజవర్గంలో చాలా విద్యాసంస్థల్లో పెనుమార్పులు చోటు చేసుకున్నాయి. కొత్త విద్యా సంవత్సరంలో గత ప్రభుత్వం తీసుకొచ్చిన సంస్కరణలు విద్యార్థులకు మరింతగా విజ్ఞానాన్ని అందించడానికి దోహదపడనున్నాయి.

పుస్తకాల కిట్లు పంపిణీ

నియోజకవర్గంలోని కొన్ని విద్యాసంస్థల్లో విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫామ్‌లతో కూడిన కిట్ల పంపిణీని ప్రారంభించారు. అయితే గురువారం నామమాత్రంగా కొనసాగిన పంపిణీ శుక్రవారం నుంచి పూర్తి స్థాయిలో జరగనున్నట్లు స్థానిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తెలిపారు. విద్యాసంస్థలకు రెండు రోజుల నుంచి కిట్లకు సంబంధించిన సామగ్రి చేరుకుంది. మొత్తం మీద కిట్లను అందించేందుకు ప్రభుత్వం నుంచి అనుమతి రావటంతో హడావుడిగా పంపిణీకి అధికారులు శ్రీకారం చుట్టారు.

స్పీడ్ బ్రేకర్లపై జీబ్రా లైన్లు వేసి సామాజిక సేవ

భవానీపురం(విజయవాడపశ్చిమ): విద్యాధరపురం కుమ్మరిపాలెం సెంటర్ నుంచి వంగవీటి మోహనరంగా జంక్షన్ వరకు ముఖ్యమైన కూడళ్లలో ఇటీవల స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేశారు. అయితే వాటిపై జీబ్రా లైన్లు వేయకపోవడంతో రహదారిలో కలిసిపోయిన స్పీడ్ బ్రేకర్లు రాత్రి పూట కనబడక నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో లయన్స్ క్లబ్ గెలాక్సీ డిస్ట్రిక్ట్ చైర్మన్ ఫర్ సర్వీస్ యాక్టివిటీస్ నారింకిషోర్ కుమార్ గురువారం స్పీడ్ బ్రేకర్లపై తెల్ల రంగుతో తాత్కాలికంగా జీబ్రా లైన్లు వేయించారు. దీంతో ప్రజలు అతని సేవలను కొనియాడుతూ హర్షం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు పెయింట్‌తో జీబ్రా లైన్లు వేయించి ప్రమాదాలను నివారించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



స్పీడ్ బ్రేకర్లపై తాత్కాలికంగా తెల్ల రంగు వేయిస్తున్న కిషోర్

కాలుష్యాన్ని తగ్గించేందుకు మొక్కలు పెంచండి

- బెంజిసర్కిల్ బ్యూటిఫికేషన్‌పై చర్యలు తీసుకోండి
- మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశం



అధికారులకు సూచనలు ఇస్తున్న కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

భవానీపురం(విజయవాడపశ్చిమ): నిత్యం రద్దీగా ఉండే బందరు రోడ్డు, బెంజి సర్కిల్ జంక్షన్ నుంచి రామవరప్పాడు వైపు వెళ్లే ఏలూరు రోడ్డుతో పాటు సర్వీస్ రోడ్డును నగర పాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ గురువారం నేషనల్ హైవే, మున్సిపల్ అధికారులతో కలిసి పరిశీలించారు. బెంజి సర్కిల్ బ్యూటిఫికేషన్‌పై అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలోని ప్రధానమైన జంక్షన్లలో బెంజి సర్కిల్ జంక్షన్ ఒకటైనందున కాలుష్యాన్ని తగ్గించే దిశగా గ్రీనరీని పెంచాలన్నారు. వర్షం కారణంగా రోడ్లు వర్షపు నీళ్లతో నిండి ప్రజలు ఇబ్బందులు పడకుండా సైడ్ డ్రెయిన్లలో సిల్ట్ తీయడమే కాకుండా డ్రెయిన్లలో మురుగునీటి ప్రవాహానికి ఎటువంటి అడ్డంకులు కలుగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ అడిషనల్ కమిషనర్ (ప్రాజెక్ట్స్) కె.సత్యవతి, డెప్యూటీ కమిషనర్ (రెవెన్యూ) జీ.సృజన, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు ఏఎస్ఎన్ ప్రసాద్, చంద్రశేఖర్, డెప్యూటీ సిటీ ప్లానర్ జూబిన్ చీరన్ రాయ్, నేషనల్ హైవే సైట్ ఇంజినీర్ అనిల్ తదితరులు పాల్గొన్నారు.

దేవస్థానం ప్రాంగణంలో రాజకీయ బ్యానర్లపై భక్తుల ఆగ్రహం



కనకదుర్గనగర్‌లోని క్యాంటీన్‌కు ఏర్పాటు చేసిన టీడీపీ బ్యానర్లు

భవానీపురం(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం ప్రాంగణం కనకదుర్గనగర్‌లో రాజకీయాలకు సంబంధించిన బ్యానర్ల ఏర్పాటుపై భక్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు గురువారం అమ్మవారిని దర్శించుకునేందుకు వస్తున్న నేపథ్యంలో ఇంద్రకీలాద్రి దిగువనున్న కనకదుర్గనగర్‌లో గల క్యాంటీన్‌కు ఒక వైపు తెలుగుదేశం పార్టీకి చెందిన ఫ్లెక్సీలను ఏర్పాటు చేయడంపై భక్తులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. టీడీపీకి చెందిన క్యాంటీన్ యజమాని అధికారంలోకి వచ్చాం కదా అని పవిత్రమైన అమ్మవారి ఆలయ ప్రాంగణంలో పొలిటికల్ బ్యానర్లను పెడితే ఆలయ అధికారులు ఏం చేస్తున్నారని మండిపడుతున్నారు. ఇది మంచి సంప్రదాయం కాదని, కనకదుర్గనగర్‌లో షాపులున్న వారు తమతమ దుకాణాల ముందు తాము అభిమానించే రాజకీయ పార్టీల బ్యానర్లను ఏర్పాటు చేసుకుంటే పరిస్థితి ఏమిటని ప్రశ్నిస్తున్నారు. దేవాలయ ప్రాంగణ పవిత్రతను కాపాడే విధంగా ఆలయ అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

ఉచిత యోగా శిక్షణ శిబిరం

కృష్ణలంక(విజయవాడతూర్పు): ఈ నెల 16 నుంచి కృష్ణలంక శాఖ శ్రీ వెంకటేశ్వర యోగ సేవా కేంద్రం ఆధ్వర్యంలో ఉచిత యోగా శిక్షణ శిబిరం ప్రారంభిస్తున్నట్లు అగ్నిమిత్ర యోగి గురూజీ పోకూరి గోవర్ధనరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలవారు 98851 68864, 98481 53417, 63048 10297 నంబర్లలో సంప్రదించాలన్నారు.

నగరం సకల కళల సమాహారం

- నిత్యం సంగీతామృత జడిలో శ్రోతలు
- రంగస్థలంపై నట దిగ్గజాల ప్రదర్శనలు
- సంప్రదాయ, పాశ్చాత్య కళల సమన్వయం
- కళాభిమానులకు కనుల విందు



హనుమంతరాయ గ్రంథాలయంలో ఉన్న డాక్టర్ అక్కినేని నాగేశ్వరరావు కళాకేంద్రం

విజయవాడకల్చరల్: విజయవాడ నగరం సకళ కళల సమాహారం. సంగీతం, సాహిత్యం, నృత్యం, చిత్రలేఖనం ఏ రంగంలో చూసుకున్నా నగరం రాష్ట్రంలో ఇతర ఏ నగరంతో పోల్చినా ప్రథమ స్థానంలోనే ఉంటుంది. నిత్యం ఇక్కడ సినీ సంగీత విభావరులు, సంగీత కార్యక్రమాలు, జాతీయ స్థాయి నాటికల పోటీలు, నృత్య కార్యక్రమాలు, చిత్రలేఖన పోటీలు జరుగుతుంటాయి. పలుమార్లు ప్రపంచ తెలుగు రచయితల మహాసభలు నిర్వహించిన ఘనత విజయవాడ నగరానిదే. దేశంలోని వివిధ ప్రాంతాల ప్రజల సంస్కృతి సంప్రదాయాలు ప్రతిబింబించే సంప్రదాయ వస్త్ర ప్రదర్శనలు కూడా అడపాదడపా జరుగుతూ ఉంటాయి. వారి కళా ప్రదర్శనలకు అవసరమైన కళాకేంద్రాలు దాదాపు 15 పైగానే ఉన్నాయి. 2 వేల మందికి పైగా కళాకారులు, 200 కళా సంస్థలు కార్యక్రమాలను నిర్వహిస్తూ ఉంటాయి. కళాకారుల సౌలభ్యం కోసం వాటి వివరాలను 'సాక్షి' పాఠకులకు అందిస్తున్నాం.

డాక్టర్ అక్కినేని నాగేశ్వరరావు కళాకేంద్రం : గాంధీనగర్‌లోని ప్రధాన కళాకేంద్రం దీన్ని హనుమంతరాయ గ్రంథాలయం అని కూడా పిలుస్తున్నారు. ప్రతి రోజూ ఇక్కడ ఏదో ఒక కార్యక్రమం జరుగుతూ ఉంటుంది. జాతీయ స్థాయి నాటికల పోటీల సాంస్కృతిక సదస్సులు నిర్వహిస్తూ ఉంటారు. 80 సంవత్సరాల సుదీర్ఘ చరిత్ర కలిగిన ఈ వేదిక సీటింగ్ కెపాసిటీ 400. ఫోన్ : 94400 35484

కళాసంస్థలకు అందుబాటులో ఉన్న ఇతర కేంద్రాలు: విజయవాడ నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే తుమ్మలపల్లి వారి క్షేత్రయ్య కళాక్షేత్రం, బందరురోడ్డులోని ఠాగూర్ మెమోరియల్ గ్రంథాలయం. బాలోత్సవ్ భవన్, మాకినేని బసవపున్నయ్య కళాకేంద్రం, మొగల్‌రాజపురంలోని పీబీ సిద్ధార్థ కళాశాలలోని సిద్ధార్థ కళాపీఠం, సత్యనారాయణపురంలోని సీతారామ కల్యాణమండంలోని కళావేదిక మొదలైనవి కళాకారులకు అందుబాటులో ఉన్నాయి.

విద్యాభారతి శ్రవణ సదనం



విద్యాభారతి శ్రవణ సదనం

దుర్గాపురంలోని శృంగేరీ పీఠపాలిత శివరామకృష్ణ క్షేత్రంలో ఇటీవల ఆధునిక సౌకర్యాలతో విద్యాభారతీ శ్రవణ సదనం పేరుతో ఏర్పాటు చేశారు. ప్రధానంగా ఇక్కడ ఆధ్యాత్మిక కార్యక్రమాలు, పెద్ద స్థాయిలో సంగీత ఉత్సవాలు, సదస్సులు జరుగుతూ ఉంటాయి. సీటింగ్ కెపాసిటీ 700. ఫోన్ : 99493 07875

గోకరాజు గంగరాజు కళావేదిక



గోకరాజు గంగరాజు కళావేదిక

ఘంటసాల వెంకటేశ్వరరావు ప్రభుత్వ నృత్య సంగీత కళాశాల ఆధ్వర్యంలో కళావేదిక నడుస్తోంది. సినీ సంగీత విభావరులు, జాతీయ స్థాయి నృత్య కార్యక్రమాలు, ప్రభుత్వ అధికారిక కార్యక్రమాలు జరుగుతూ ఉంటాయి. చిన్న సంస్థలకు అందుబాటులో ఉంటుంది. సీటింగ్ కెపాసిటీ సుమారు వెయ్యి. ఫోన్ : 94412 79833

కౌతా పూర్ణానందం కళావేదిక



కౌతా పూర్ణానందం కళావేదిక

గాంధీనగర్‌లోని కౌతా పూర్ణానందం ట్రస్ట్ నిర్వహణలో కళావేదిక నిర్వహిస్తున్నారు. ప్రధానంగా ఇక్కడ సినీ సంగీత విభావరులు నిర్వహిస్తూ ఉంటారు. సామాన్యులకు అందుబాటులో ఉంటుంది. సీటింగ్ కెపాసిటీ 200. ఫోన్ : 94901 96072

బెంజిసర్కిల్ సమీపంలో నిలిచిన వర్షపు నీరు



నిర్మల కాన్వెంట్ రోడ్డులో నిలిచిన వర్షపు నీరు



వర్షం.. నగరం జలమయం

నగరంలో గురువారం సాయంత్రం కుంభవృష్టి కురిసింది. దీంతో జనజీవనం అస్తవ్యస్తమైంది. సాయంత్రం వేళ పాఠశాలలు, కళాశాలలు, కార్యాలయాల నుంచి ఇళ్లకు తిరిగి వెళ్లే వారు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రోడ్ల పక్కన వ్యాపారాలు చేసుకునే చిరు వ్యాపారులను వర్షం దెబ్బతీసింది. నగరంలోని బెంజి సర్కిల్, నిర్మలా కాన్వెంట్ రోడ్డు, పిన్నమనేని పాలి క్లినిక్ రోడ్లు పూర్తిగా జలమయమయ్యాయి. వర్షం కారణంగా చాలా చోట్ల ట్రాఫిక్ జామ్ అయి ద్విచక్ర వాహనదారులు నానా పాట్లు పడ్డారు.

–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ





పిన్నమనేని పాలీక్లినిక్ రోడ్డులో..

యువతకు ప్రగతిపథ మార్గదర్శి భగవద్గీత

శ్రీవిద్యాపీఠాధిపతి బాల స్వామీజి



విజేతకు బహుమతి అందిస్తున్న రాజగోపాల చక్రవర్తి, సునీత మధుసూదన్ దంపతులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): యువతను ప్రగతి పథంలోకి నడిపించే మార్గదర్శి శ్రీకృష్ణుడు అర్జునునికి ఉపదేశించిన భగవద్గీత అని శ్రీవిద్యాపీఠాధిపతి (తెనాలి) శ్రీప్రజ్ఞానంద సరస్వతి (బాల స్వామీజీ) అన్నారు. భవానీపురానికి చెందిన శ్రీగోవిందనామ ప్రచార సేవా సంఘం ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం గొల్లపూడి బైపాస్ రహదారిలో గల శ్రీరస్తు కల్యాణ మండపంలో నిర్వహించిన శ్రీభగవద్గీత ప్రగతిపథం కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులతో భగవద్గీత శ్లోక పఠనం పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసి విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం బాల స్వామీజీ మాట్లాడుతూ వ్యక్తిత్వ వికాసానికి భగవద్గీత ఎంతగానో దోహదపడుతుందని అన్నారు. సమాజంలో ఉన్నత స్థాయికి ఎదిగేందుకు విజయావకాశాలను చూపించే దర్శిని భగవద్గీత అని అన్నారు. దేవదాయ ధర్మదాయ శాఖ ధర్మప్రచార పరిషత్ కో ఆర్డినేటర్ డాక్టర్ వేదాంతం రాజగోపాల చక్రవర్తి మాట్లాడుతూ గోవిందనామ ప్రచారాన్ని ఒక సేవా కార్యక్రమంగా ఎంచుకున్న టి.సునీతా, మధుసూదన్ దంపతులు అభినందనీయులన్నారు. ముఖ్యంగా విద్యార్థులతో భగవద్గీతలోని శ్లోకాలను పఠింపచేస్తూ వారిలో ఆధ్యాత్మిక చింతన పెంపొందించటం శుభపరిణామమని తెలిపారు.

బాలిక అదృశ్యంపై కేసు నమోదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): మైనర్ అదృశ్యమైన ఘటనపై కొత్తపేట పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కొత్తపేట ఆంజనేయ వాగు సెంటర్‌కు చెందిన ముస్లిం దంపతులకు ఇద్దరు సంతానం. వారి కుమార్తె(16) 8వ తరగతి వరకు చదువుకుంది. అయితే బాలిక ప్రవర్తన సరిగా లేకపోవడంతో చదువు మధ్యలోనే ఆపేసింది. ఈ నెల 9వ తేదీన రాత్రి భోజనాలు చేసిన తర్వాత అందరూ నిద్రపోగా తెల్లవారు జామున లేచి చూసేసరికి బాలిక కనిపించలేదు. బాలిక తల్లి పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.